క్లుప్తంగా

రజక మహాసభకు తరలిరండి



పోస్టర్లు విడుదల చేస్తున్న రజక సంఘం నాయకులు

కంబదూరు: అనంతపపురం పట్టణంలోని లలిత కళాపరిషత్‌లో ఈనెల 28న నిర్వహించే జిల్లా రజక మహాసభను విజయవంతం చేయాలని రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు నారాయణస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాథ్ కోరారు. ఆదివారం వారు మండల కేంద్రంలో పర్యటించి కార్యక్రమం విజయవంతంపై స్థానిక రజకులతో చర్చించారు. మండలం నుంచి రజకులు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అజ్జప్ప, రామ్మోహన్, గంగాధర్, మురళి, నరేష్, మల్లప్ప, మధు, మారెన్న, తిప్పేస్వామి, నారాయణప్ప, ఎర్రిస్వామి, ముత్యాలు, కనకప్ప, మహేష్, ఓబుళేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీటీసీ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ

కూడేరు: మండల కేంద్రంలోని హైస్కూల్‌లో అనంతపురానికి చెందిన శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతపురంలోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి వైద్య శిబిరం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ రోగాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులు పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కొందరిని శస్త్ర చికిత్సకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కృష్ణ శశి, వైద్య నిపుణులు వంశీకృష్ణ, శ్రీకృష్ణ శశి, కృష్ణకాంత్‌రెడ్డి, సతీష్, జాగృతి స్కూల్ ఫౌండర్స్ శిరీష, పురుషోత్తం, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న ఎస్‌ఐ ఆంజనేయులు

బొమ్మనహాళ్: అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, 624 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు ఆదివారం తెలిపారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన బోయ బసవరాజు, తలారి వన్నూరుస్వామి, ఎరుకుల నాగరాజు అక్రమంగా కర్ణాటక నుంచి మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా పోలీసులు బొమ్మనహాళ్ చెక్‌పోస్టు వద్ద వారిని అరెస్టు చేశారు. వారి నుంచి మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం విక్రయిస్తున్నట్లు లేదా సరఫరా చేస్తున్నట్లు తెలిస్తే 9346010584 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

లారీ బోల్తా .. తప్పిన ప్రాణాపాయం



బొమ్మనహాళ్: మండలంలోని శ్రీరంగాపురం క్యాంపు- ఉప్పరహాళ్ క్రాస్ రహదారిలో ఆదివారం ఉదయం భారీ లారీ బోల్తా పడింది. ఎటువంటి ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కర్ణాటకలోని జిందాల్ ఫ్యాక్టరీ నుంచి హిందూపురానికి వెళ్తున్న లారీ మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్ సమీపంలోకి తెల్లవారుజామున 4 గంటలకు రాగానే అదుపుతప్పి పక్కన ఉన్న మాగాణిలోకి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ బబ్లుసింగ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇదే సమయంలో ఒక విద్యుత్ స్తంభం కూలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

చురుగ్గా కుల గణన సర్వే

- చరిత్రాత్మక ఘట్టానికి సీఎం జగన్ శ్రీకారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

రాయదుర్గం: కుల గణన సర్వే ప్రక్రియ రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 194 గ్రామ సచివాలయాల పరిధిలో చురుగ్గా సాగుతోంది. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివిధ సామాజిక వర్గాల వారీగా జనాభా సంఖ్యను తేల్చే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ ఈ నెల 19 నుండి 28 వరకూ కొనసాగనుంది. సర్వేలో 770 మంది సచివాలయ సిబ్బంది, సుమారు 3,250 మంది వలంటీర్లు పాల్గొంటున్నారు. డివిజన్‌లోని రెండు అర్బన్‌లతో పాటు 15 మండలాల్లో 3,115 క్లస్టర్లుగా విభజించారు. అందులో 2,01,768 కుటుంబాలు, 6,90,900 జనాభా ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులకే పరిమితమైన కుల గణన సర్వేకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడంతో సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సర్వేలో సేకరించే వివరాలిలా..

కుటుంబంలో సభ్యులు అందుబాటులో ఉన్నారా..? మరణించారా..? వలస వెళ్లారా..? జిల్లా, జిల్లా కోడ్, మండలం/మున్సిపాలిటీ, గ్రామం, పంచాయతీ కోడ్, వార్డు నంబర్, ఇంటినంబర్, కుటుంబ పెద్ద పేరు, ఆధార్, కుటుంభ సభ్యుల సంఖ్య, రేషన్‌కార్డు వివరాలు పొందుపర్చుతారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు, మండల ప్రత్యేకాధికారులు సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తారు.



నేత్రపల్లిలో కులగణన సర్వే చేస్తున్న అధికారులు

అపోహలు వద్దు



కులాల వారీగా.. సామాజిక.. విద్య ఆర్థిక పరిస్థితులను తెలుసుకుని అర్హులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించేందుకు కులగణన దోహదపడుతుంది. ఈ ప్రక్రియపై కొందరు అపోహ పడుతున్నారు. ఆధార్ తదితర వివరాలను వెల్లడిస్తే పథకాలను తొలగిస్తారనే వదంతులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇలాంటి వాటికి ఆస్కారం లేదు. యాప్‌లో నమోదుచేసే సమాచారం పూర్తి భద్రత, గోప్యతతో ఉంటాయి.

– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం

సిబ్బందికి సహకరించాలి



కుల గణన సర్వే ప్రక్రియను డివిజన్ వ్యాప్తంగా పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఈ ప్రక్రియ పూర్తయితే ఏఏ సామాజిక వర్గం వారు ఎంత మంది ఉన్నారు..? వారికి ప్రభుత్వం తరపున ఏఏ అవసరాలు సమకూరాలో తెలుస్తుంది. ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి సహకారం అందించాలి.

– రాణిసుష్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

పారదర్శకంగా చేపట్టాలి



టి.వీరాపురంలో కులగణన సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ కొండయ్య

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ కొండయ్య సూచించారు. మండలంలోని టి.వీరాపురంలో చేస్తున్న సర్వేను ఎంపీడీఓతో పాటు మండల ప్రత్యేకాధికారి నాగరాజ రావు ఆదివారం పర్యవేక్షించారు. ప్రతి ఇంటినీ సందర్శించి కులగణన నమోదు పక్కాగా చేయాలని వలంటీర్లకు సూచించారు. సర్వేను సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, వలంటీర్ల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లికార్జున, మాజీ ఎంపీపీ భారతి, పంచాయితీ కార్యదర్శి యల్లక్క పాల్గొన్నారు.

దశభుజ గణపతికి పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగు



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: చిరు వ్యాపారుల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఏపీఐఐసీ చైర్మన్, పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని తోపుడుబండ్ల వ్యాపారులను కలుసుకుని వారి కష్ట, సుఖాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లపక్కన, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయాలు అమ్ముకునే చిరు వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. మంచిచేసే ప్రభుత్వానికి వ్యాపారులంతా మద్దతుగా నిలవాలని విజ్ఞప్తిచేశారు. అనంతరం కురగాయల మార్కెట్లో పర్యటించి వ్యాపారులు, రైతుల ఇబ్బందులపై ఆరా తీశారు. మెట్టు వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ వలీబాషా, పార్టీ నాయకుడు పొరాళ్ల శివ, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, ఐనాపురం మంజు, వార్డు ఇన్‌చార్జులు నిజామ్, బషీర్, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, తాళ్లకెర వీరభద్రారెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన గుమ్మఘట్ట, బొమ్మనహాళ్ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, దుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతిఒక్కరూ కార్యకర్తల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి నీటి సరఫరాకు చర్యలు..

సమ్మె నిర్వహిస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి ఉద్యోగులతో మెట్టు గోవిందరెడ్డి చర్చలు నిర్వహించారు. ప్రజా ఇబ్బందుల దృష్ట్యా నీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం సుగమమ్యేలా కృషి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం నీటి పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



బెస్తరపల్లిలో ఆత్మీయ పలకరింపు సభలో మాట్లాడుతున్న సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య

కుందుర్పి: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని కళ్యాణదుర్గం సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య సూచించారు.ఆదివారం మండలంలోని తూముకుంట, బెస్తరపల్లి, మహంతపురం తదితర పంచాయతీల పరిధిలోని ఐదు గ్రామాల్లో ఆయన ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు, ప్రజలు ఎంపీకి ఘనంగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. దేశంలో ఎక్కడాలేని కుల మత రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధిని చేసి చూపించారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జంబుగుంపల-బెస్తరపల్లి రోడ్డు మరమ్మతు చేయించాలని స్థానికులు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, సచివాలయ మండల కన్వీనర్ ఈ.రాము, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, వైస్ ఎంపీపీలు భీమిరెడ్డి, శ్రీలక్ష్మి, మాజీ సర్పంచ్ సుదర్శనరెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లింగప్ప, సర్పంచ్‌లు హనుమంతరాయుడు, జగన్, ఎంపీటీసీలు ఓబనాథ్, బసవరాజు, ఈరన్న, నాయకులు రామూర్తి, బీటీ రాము, పెద్దపయ్య, భీమప్ప, రాజ్‌కుమార్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌కు పరామర్శ

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీలోని బాల వెంకటపురం గ్రామానికి చెందిన వలంటర్ జిలాన్ బాషాను ఆదివారం. ఎంపీ తలారి రంగయ్య పరామర్శించారు. అనంతరం ఆయన కార్యకర్తలతో మాట్లాడారు.

శుభకార్యం

బాలవెంకటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నిజామ్ వలీ కూతురు అసియా బేగం-ఆలి మహ్మద్ వివాహ వేడుకల్లో ఎంపీ తలారి రంగయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు తిప్పేస్వామి, జెడ్పీటీసీ బొమ్మన్న, కురుబ సంఘం తాలుకా అధ్యక్షుడు దొణస్వామి, సర్పంచ్ సోమశేఖర్, ఎంపీటీసీ ధనంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిత్తయ్య(43) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సమన్వయకర్త, ఎంపీ తలారి రంగయ్య ఆగ్రామానికి వెళ్లి మృదేహానికి నివాళులర్పించారు. మృతుని భార్య గీతమ్మకు ఎంపీ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వైఎస్సార్ బీమా కింద తక్షణసాయం రూ.10 వేలు అందజేశారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెస్ రాయుడు, దొడ్డ తిప్పేస్వామి, లింగమయ్య, వీరాంజనేయులు, గంగాధర, దొణస్వామి, గోళ్ల సూరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి

కణేకల్లు: ఉరవకొండలో మంగళవారం జరగనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి కోరారు. కణేకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 'వైఎస్సార్ ఆసరా' నాలుగో విడత రుణమాఫీ సొమ్ము డ్వాక్రా అక్కాచెల్లెమ్మల అకౌంట్లలో వేయడానికి సీఎం జగన్ ఉరవకొండకు వస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ తప్పక హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ ఉషారాణి, పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, నాయకులు కోళకుర్తి జయరామిరెడ్డి, పాటిల్ చెన్నకేశవరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మాబుపీరా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వై.చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

'ఆసరా' లబ్ధిదారులంతా తరలిరండి

కూడేరు: వైఎస్సార్ ఆసరా పథకం కింద లబ్ధిదారులకు సోమవారం ఉరవకొండలో జరిగే సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాలుగో విడత నగదును బటన్ నొక్కి ఖాతాల్లోకి జమ చేస్తారని స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ బాబు తెలిపారు. ఆదివారం స్థానిక వైకేపీ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా లబ్ధిపై వీఓఏలతో ఏపీఎం రాజశేఖర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు స్వయం సహాయక సంఘ సభ్యులంరి ఖాతాల్లో నగదు ఖాతాల్లోకి జమవుతుందన్నారు. సభ్యులందరూ సీఎం సభకు విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో విజేత సమాఖ్య మండల అధ్యక్షురాలు వసంత, సీసీలు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పకడ్బందీగా నిర్వహించండి



కో ఆర్డినేటర్, పీడీలతో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

రాయదుర్గం రూరల్: గ్రామీణ క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించ తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు నియోజకవర్గస్థాయిలో పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజు రావు, ఎంపీడీఓ కొండయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో వారు ఆదివారం ఆడుదాం ఆంధ్రా కో ఆర్డినేటర్ హెచ్.నాగేంద్ర, పీడీలు రామాంజనేయులు, సుధాకర్, మల్లికార్జున, దివాకర్, జయప్ప, ఇస్మాయిల్‌తో సమావేశం నిర్వహించారు. ఈ నెల 24 నుంచి నిర్వహించే నియోజకవర్గ స్థాయి క్రీడలకు ఎంపికైన జట్ల వివరాలపై ఆరా తీశారు. కబడ్డీలో పట్టణంలోని కోటవీధికి చెందిన టీం, ఖోఖో లో జుంజురాంపల్లి టీం, వాలీబాల్, బ్యాట్మింటన్ కు కణేకల్లు రోడ్డులోని సచివాలయం-2 టీం, క్రికెట్‌కు పట్టణంలోని శాంతినగర్ కు చెందిన విజయ్ టీం ఎంపికైనట్లు పీడీలు తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయండి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కణేకల్లు: గుమ్మగట్ట మండలంలోని బేలోడులో ఎమ్మార్పీఎస్ నాయకుడు రామాంజనేయులు, అతని కుటుంబ సభ్యులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని కణేకల్లు మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు యర్రగుంట రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర డిమాండ్ చేశారు. కణేకల్లులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ముక్కన్న, ఎర్రిస్వామి, మాణిక్య, లక్ష్మీనారాయణ, సురేష్, శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసేవ నిమిత్తమే ఇన్ఫినిటీ ట్రస్ట్'

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలకు మరింత సేవ చేయటం కోసమే ఇన్ఫినిటీ ట్రస్ట్ ఏర్పాటు చేశానని విశిష్ట సేవా అవార్డు గ్రహీత, ఉపాధ్యాయుడు, ట్రస్ట్ చైర్మన్ బద్దే నాయక్ అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో ఆదివారం ట్రస్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ట్రస్టు ఏర్పాటు చేశానన్నారు. అనంతరం పలువురు దాతలు ట్రస్టుకు విరాళం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కంబాల తిమ్మారెడ్డి, లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు చకచకా ఏర్పాట్లు



బహిరంగ సభా స్థలి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి తదితరులు

ఉరవకొండ: నాలుగో విడత వైఎస్సార్ ఆసరా సొమ్మును విడుదల చేయడానికి మంగళవారం ఉరవకొండకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. అలాగే సీఎంను స్వాగతిస్తూ పట్టణం అంతటా ఫ్లెక్సీలు భారీగా వెలిశాయి. అనంతపురం రహదారి వద్ద భారత్ పెట్రోల్ బంకు పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలి వద్ద ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ గౌతమి, జిల్లా ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలసి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ ప్రణయ్ రెడ్డి పరిశీలించారు. అలాగే హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను వారు పరిశీలించారు.



ఉరవకొండ పట్టణంలో వెలసిన ఫ్లెక్సీ



సీఎం హెలిప్యాడ్ ల్యాండింగ్ వద్ద చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 1995–96లో పాఠశాలలో చదివిన విద్యార్థులు కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాలలో చదివినప్పటి తీపి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. నాడు విద్య నేర్పిన ఉపాధ్యాయులు నారాయణస్వామి, గుండురావు, రామస్వామి, వన్నూరెడ్డి, హుసేన్‌పీరాను సన్మానించారు. కార్యక్రమంలో గౌస్, వన్నూరుస్వామి, ఆనంద్, ముక్కణ్ణ, రుద్రమణి, రాజశేఖర్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయకమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలారాముని ప్రాణ ప్రతిష్ట పూజలను పురస్కరించుకుని మండలం కేంద్రంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి ఆలయంలో పంచామృతాభిషేకాల అనంతరం 9 గంటల నుంచి 10.30 గంటల వరకూ కల్యాణోత్సవం ఉంటుందన్నారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో సోమవారం సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. అయోధ్యలో రామచంద్రుని విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని రామస్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 8 గంటలకు సీతారాములస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

రాముని శోభతో పులకరించిన పట్టణం

కళ్యాణదుర్గం రూరల్: అయోధ్యలో సోమవారం బలరాముని ప్రాణ ప్రతిష్ట జరుగుతున్న సందర్భంగా కళ్యాణదుర్గం పట్టణంలోని ప్రధాన కాలనీల్లో రాముని విగ్రహ ప్రతిష్ట, కాషాయం ఫ్లెక్సీలు, జెండాలతో నిండిపోయాయి. పట్టణంలోని ఆలయాలయాలతో పాటు ఇళ్లలో రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.